
నూరేళ్ళ తెలుగు కథకు

నవ్య నీరాజనం - 61



# తెలుగు కథ నింగినంటినా... దాని కాళ్ళు నేలమీదే ఉండటం ఆనందం

**- భమిడిపాటి జగన్నాథరావు**

తక్కువ కథలు రాసినా కథకుడిగా గొప్ప పేరున్న వ్యక్తి భమిడిపాటి జగన్నాథరావు. తరచుగా కథలు రాయకపోయినా, నిత్యం కథలు చదవడం ఆయనకు ఎక్కువ ఇష్టం. తెలుగు కథకు ఆయన దగ్గర స్నేహితుడు. సన్నిహితుడు. తన ముందు తరాల వారికి, తన తరువాతి తరాల వారికీ స్నేహపాత్రుడు. అప్పటి జీవితాలనూ, అనుభూతులను అక్షరబద్ధం చేసినప్పటికీ మానవత్వం భూమికగా కథలు రాసిన అరుదైన రచయిత భమిడిపాటి జగన్నాథరావు గారితో ఇంటర్వ్యూ ఈవారం..


## మేస్టారిని బెత్తంతో కొట్టి పారిపోయాను

మా నాన్నగారు బ్రిటిష్ ప్రభుత్వంలో చిన్న ఉద్యోగి. డబ్బుకు గొప్ప వెసులుబాటు లేకపోయినా, డబ్బు ఇబ్బంది బాధించలేదు. మా నాన్నగారు, మా మేనమామ చాలా ఇంగ్లీషు సాహిత్యం చదివేవారు. మా అమ్మగారు చారిత్రిక, అపరాధ పరిశోధక, సాంఘిక నవలలు బాగా చదివేవారు. నాకు ఓ అన్నయ్య, ఓ చెల్లెలు. అన్నయ్య కొత్త తరహా సాహిత్యం బాగా చదివేవాడు. ఈనాటికీ అతను కల్పనా సాహిత్యంతో పాటు, శాస్త్ర, సాంకేతిక, ఆధ్యాత్మిక పుస్తకాలు చదువుతూనే ఉన్నాడు. మా చెల్లెలు జీవితంలో ప్రశాంతత, శాంతి సాధించి, ఇతరులకు సహాయ, సహకారాలు అందించటంలో ఆనందం పొందేది. నా భార్య, ఇద్దరు ఆడపిల్లలు, అల్లుళ్ళు, మనుమలు అంతా ప్రశాంతంగా జీవితాలు నడుపుకుంటున్నారు. చదవడం మా కుటుంబంలో స్థిరపడిన అంగం. నేను మాత్రం కల్పనా సాహిత్యానికే పరిమితమై, ఆ చిన్న పరిధిలోనే ఉన్నాను.

నా చిన్నతనంలో నేను చేసిన కొన్ని పనులు, కొన్ని అలవాట్లు తలుచుకుంటే నాకు చిన్నతనంగానే ఉంటుంది. అక్షరాలు దిద్దమన్న మాస్టారి మాట వినకుండా మొండికేస్తే ఆయన పేక బెత్తంతో బెదిరించబోతే, కొట్టేస్తారేమోనన్న భయంతో, బెత్తం లాక్కొని, ఆయన్నే కొట్టేసి, ఇంటికి పారిపోయాను. సెకెండు ఫారం నాటికే, మూడుముక్కలాట ఆడుతూ, నేను ఆ పేకాటలో నిష్ణాతుణ్ణి అయ్యాను. హైస్కూల్‌లో స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో నేను చాలా ప్రావీణ్యం కనపరిచాను. ఆ సమయంలోనే తణుకు, భీమవరంలలో లైబ్రరీలకు వెళ్ళి రకరకాల పుస్తకాలు తెలుగు, ఇంగ్లీషులలో చదవడం అలవాటయింది. సాహిత్యం చదువుతూ, అర్థం చేసుకుంటూ, చిన్నతనపు చెడు అలవాట్ల జోలికి వెళ్ళలేదు. కాస్త పెద్దవాణ్ణి అయ్యాక నాటకాలు వేసేను. చిన్నతనంలోనే సాహిత్య లోకంలో దిగబడిపోయాక ఆటలు, నాటకాలు అల్లరచిల్లర చిలిపితనాలు అన్నీ మటుమాయం.

## చాలా బలహీనమైన అనువాదం

1950లో 'మపాసా' 'నెక్లెస్' చదువుతుంటే గొప్ప ఉద్వేగం నన్ను ఆవహించి నా చేత ఆ కథానికను 'కంఠాభరణం' అన్న శీర్షికతో బాగా కుదించి అనువాదం చేసేలా చేసింది. అది మా కాలేజీ మాగజైన్‌లో అచ్చయింది. కాని అది అచ్చులో చూసుకుంటే తెలిసింది – అది చాలా బలహీనమైన అనువాదం అని. చాలా చిన్నవయసులోనే కథలు చదవగా, చదవగా ఆ గొప్ప కథకుల లాగ వ్రాసెయ్యాలన్న 'ఆబ'తో నేను కథలు వ్రాసేయడం మొదలు పెట్టాను. నా తొలి కథ (విరుద్ధ మనస్తత్వం) 1951లో వ్రాసినా, 1952 మొదట అచ్చు అయినది ఇంకొకటి.


కుటుంబ సభ్యులతో...

## అవి వ్రాయడం నాకు చేతకాదు

కథానికలు, కవిత్వం, నవల, విమర్శలు, జీవిత చరిత్రలు, ఇంకా ఇతర సాహితీ ప్రక్రియలన్నీ చదువుతాను. కవిత్వం, నవల, నాటిక, విమర్శ వ్యాసాలు ఏవీ నేను వ్రాయలేదు. ఏమంటే అవి వ్రాయడం నాకు చేతకాదు. కథానికా ప్రక్రియ మీద నాకు కాస్త ఎక్కువ మమకారం కాబట్టి, కొద్దిగా కథానికలు, సాహిత్య ఔన్నత్యాన్ని ద్విగుణీకరించిన రచయితల గురించి కొద్ది వ్యాసాలు వ్రాసాను. ఈ అరవై ఏళ్లలో నేను వ్రాసినవి ముప్పయి కథానికలు, 10, 12 చిన్న వ్యాసాలు.

## వారే నాకు మార్గదర్శకులు

గురజాడ అప్పారావుగారు, గుడిపాటి వెంకటచలం గారు, శ్రీశ్రీగారు, పాలగుమ్మి పద్మరాజు మాస్టారు (కాలేజీలో వారు నాకు రసాయన శాస్త్రం బోధించిన మాస్టారు) నాకు సాహిత్య పరంగానూ, నా జీవిత పథంలోనూ మార్గదర్శకులుగా నేను నమ్ముతాను. అప్పారావు గారి ద్వారా మనుష్యులనూ, జీవితాన్నీ ప్రేమించాలనీ, చలం గారి ద్వారా స్త్రీలను ఏ విధంగా అర్థం చేసుకోవాలన్నదీ, పద్మరాజు మాస్టారి ద్వారా మనుష్యులనూ, జీవితాన్నీ నీతి సూత్రాల ద్వారా కాక మానవతా దృష్టితో తెలుసుకోవాలనీ, శ్రీశ్రీ గారి ద్వారా లేమితనంలో కునారిల్లుతున్న పీడిత, బాధిత సామాన్యుల బాధలకు సహానుభూతితో ఐక్యం అవ్వాలనీ, ఎంత తెలిసినా నమ్రతతో ఒదిగి ఉండాలనీ తెలిసి, నన్ను నేను వీలైనంతగా సరిదిద్దుకుందుకు ప్రయత్నించాను. అతి సామాన్యులు, బొటాబొటి సంపాదనతో జీవితాన్ని లాగిస్తున్న వారితో నాకు ఉన్న పరిచయాలు, వారిలోని సంస్కారం, నిజాయితీ, అనుభవం ఇవన్నీ నన్ను వినమ్రుడిని చేసి, ఒదిగి ఉండి సంస్కారంతో జీవితం గడపాలని నాకు పాఠాలు నేర్పేయి.

## వారంటే నాకు ఎడ్మిరేషన్

నాకు ముప్పై ఏళ్లు వచ్చేదాకా ఏ రచయితనూ కలవలేదు. 1965లో మచిలీపట్నంలో మొదటిసారిగా శ్రీ సింగరాజు రామచంద్ర మూర్తిగారిని ఆయన ఇంట్లో కలిసాను. ఆయన సున్నితమైన హాస్యంతో మంచి కథలు వ్రాసారు. ఆయన ద్వారా శ్రీయుతులు ఆదివిష్ణు, విహారి, శాలివాహన, టి.ఎల్. కాంతారావు, నందం రామారావు, పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారలను కలిసే అదృష్టం కలిగింది. ఆ తరువాత – నా ముందు తరం, నా తరం, నా తరువాతి, తరువాతి తరం రచయితలు అందరితో నాకు గాఢమైన స్నేహ బాంధవ్యం, సాన్నిహిత్యం ఉన్నాయి. అందులో ముఖ్యులు శ్రీ భమిడిపాటి రామగోపాలం గారు, శ్రీ త్రిపుర గారు. కొద్ది కథానికలే రాసిన త్రిపురగారు, 'ఎంతవారలైనా..' లాటి గొప్ప కథానిక రాసిన 'రౌద్రి' గారు, 'సర్కస్' లాటి గొప్ప కథానిక రాసిన పార్వతిగారు, '2+2' లాటి గొప్ప కథానిక రాసిన విరియాల లక్ష్మీపతి రావు గారు, 'స్మైల్' గారు రాసిన కథానికలు నాకు చాలా ఇష్టం. త్రిపుర గారి కథలంటే నాకు కొంచెం ఎక్కువ ఇష్టం అని చెప్పుకోవడం నాకు మరింత ఇష్టం. త్రిపుర గారంటే నాకు ఎడ్మిరేషన్. బాలగంగాధర తిలక్ గారు, 'అజంతా'గారి కాకినాడ ఇస్మాయిల్ గారి, వేగుంట మోహనప్రసాద్ గారి, శివారెడ్డిగారి కవిత్వం నన్ను మంత్రముగ్ధుడిని చేస్తుంది.

## ఇంకాస్త శిల్పం మీద దృష్టి సారించాలి

తెలుగు కథ అందలాలు ఎక్కినా, నేలమీదే కాళ్ళు ఊని, సామాజిక సాంఘిక రాజకీయ వివిధ అస్తిత్వ పరిణామాల ఉరవడిలో తెలుగు జీవితాన్ని తాత్విక సూత్రాలలో ఇముడ్చుకుని పాఠకులను ఆలోచింపచేసి కదిలించగలుగుతోంది. తెలుగు కథను నేలకు, నింగికి మధ్య విరాట్ స్వరూపంలా నేటి యువరచయితలు తీర్చిదిద్దుతున్నారు. ఇంకాస్త శిల్పం ప్రాధాన్యం మీద దృష్టి సారిస్తే ఇంకాస్త మంచిది. జీవితంలో వేదన, దుఃఖమే కాకుండా ప్రేమ, ఆనందం, శాంతి కూడా ఉన్నాయి. వీటిని బలంగా పలకవలసిన బాధ్యత కొత్త తరం కథకుల మీద ఉంది. అన్ని ఒడి

దుడుకులలోనూ – మానవ సంబంధాల్లో చిప్పిల్లి 'ఊజ్' అయ్యే ఆరోగ్యకరమైన, ప్రేమార్ద్రమైన, శాంతితో కూడిన ఆనందపు సరిహద్దులను కూడా ఈ తరం రచయితలు పట్టించుకుని వ్రాయాలని కోరుకుంటున్నాను.

## పత్రికల పోలీసింగ్ పద్ధతి మారాలి

తెలుగులో రచయితల గురించి 'మోనోగ్రాఫ్స్' కొరత చాలా ఉంది. ఆ పని సాహిత్య సంస్థలు చేపట్టాలని నా వినతి. తెలుగులో మంచి సాహిత్యాన్ని ఇతర భారతీయ భాషలలోకి అనువదించడంలోనూ మనం గొప్ప 'నిశ్శబ్దం' అవలంబిస్తున్నాం. ఆ విషయంగా కుప్పంలోని ద్రావిడ విశ్వవిద్యాలయం వారు కొంత పనిచేసినా, మిగతా సాహిత్య సంస్థలు కూడా పూనుకుని చేయడం మన తక్షణ కర్తవ్యం. కథానికల విషయంలో పత్రికల వారు 3 పేజీలు అచ్చులో ఉంటే బాగుంటుందని లౌక్యంగా చేసే 'పోలీసింగ్' పద్ధతి మారాలని నా కోరిక.

## తనివి తీరని దాహం

పుస్తకాలు చదవడం నాకు దాహం తీరుస్తున్నట్లు ఉండేది. ఆ దాహాన్ని పెంచుతున్నట్లు ఉండేది. ఈ పుస్తకాల దాహం నాకు ఇష్టంగానూ ఉండేది, తనివి తీరనట్టుగానూ ఉండేది. ఆ పుస్తకాల్లోంచి ఆయా రచయితలు నాతో మాట్లాడుతున్నట్లు, నా కోసమే చెపుతున్నట్లు, నా చెవిలో ప్రేమగా సంగీతాన్ని వినిపిస్తున్నట్లు ఉంటుంది. ఉద్యోగ విరమణ చేసిన ఈ పదిహేడేళ్ళలో సాహిత్య పఠనం నాకు ఉత్సాహాన్నీ, ఉల్లాసాన్ని, ఆనందాన్నీ, శాంతినీ ఆందిస్తూ నా మిగులు సమయాన్ని అర్థవంతం చేసింది.

## ఒక్క సాహిత్యం మాత్రమే దర్శించగలదు

జీవితం తాలూకు విస్తృతమైన పరిధినీ, మానవుల ప్రవృత్తులనూ, ఆలోచనలను, ఆచరణలను, జీవించడంలోంచి ఉబికి వచ్చే సంఘర్షణలను, వైరుధ్యాలను – ప్రేమతో, ఆర్ద్రతతో, ఇష్టంతో – ఒక్క సాహిత్యం మాత్రమే దర్శించి మనకు అందించగలదన్న విశ్వాసం నాది. రచయితలు, సాహిత్యం, సాహితీ మిత్రులు, సంస్కారంతో మిలమిలలాడే సామాన్యులు నా జీవితంలో కలిసిపోయిన అనుబంధంగా, ఆత్మీయంగా మిగిలి – నన్ను వెలుగు దిశగా నడపడం నాకు జీవితంలో మిగిలిన సంతృప్తికరమైన అనుభవం, అనుభూతి.

## జీవితం ఉంటేనే కదా ఏ కళఅయినా


సాహిత్య విషయంగా నాకు రాయడం కన్నా చదవడమే ఇష్టం. అయినా జీవితం అందించే అనుభవం, చదువు ఇచ్చే అనుభూతి కన్నా గొప్పది అని నేనునమ్ముతాను.అసలు జీవితం ఉంటేనే కదా ఏ కళ అయినా (సాహిత్యం కూడా) జీవించి ఉండేది. కళ (సాహిత్యం) ప్రయోజనమే విశిష్టమైన, సుస్పష్టమైన, కాంతిపథంలో నడిపించే జీవితమే కదా. సాహిత్యం నా జీవితాన్ని ప్రేమతో నింపి, మనుషులను, జీవితాలను ఇష్టంగా ప్రేమించగలగడం అనే గొప్పవరాన్ని నాకు ప్రసాదించింది.

– వి.ఆర్.ఎమ్.ఆర్.



# వస్తు గుణదీపిక







ధనియాలు: చలవజేసి ఆర్చుతాయి. తీపి, వగరు రుచులు కలిగి స్వాదుగా ఉంటాయి. వీటి రసం, చూర్ణం, కషాయం తలత్రిప్పు, పైత్య వికారం, చర్ది, ఎక్కిళ్ళు, అరుచి, జ్వరం, కడుపులోమంట, తాపాన్ని హరిస్తాయి. ఆకలిని కలుగజేస్తాయి. విరేచనాల్ని కట్టిస్తాయి. పొట్టకు బలాన్నిచ్చి, నిద్ర కలిగిస్తాయి. వీటిని నీళ్ళతో నూరి పట్టు వేసిన తలనొప్పి తగ్గిపోతుంది. పచ్చి ధనియాలు చేదుగా మధురంగా ఉంటాయి. మూత్రాన్ని అధికంగా జారీ చేస్తాయి. పైత్యాన్ని హరిస్తాయి. వీటిని నూనెలోగాని, నేతిలోగాని వేపి, తగు మాత్రం కారం, ఉప్పు కలిపి పొడి చేసి ఉంచుకుని, అన్నంలో కలిపి తీసుకున్న పక్షంలో అజీర్ణం, అజీర్ణ విరేచనాలు పోతాయి. జ్వరపడి లేచినవారు, ప్రసవ స్త్రీలు ఈ పొడిని వాడితే వారికి అనుకూలంగా ఉంటుంది.



ధూమం: దేవతల ప్రీతి కొరకు చేసే హోమధూమం, సాంబ్రాణి, గుగ్గిలం, మొదలయిన వాటి ధూపధూమం ఆరోగ్యాన్ని, ఆయుర్వృద్ధిని కలిగిస్తుంది. ఈ ధూమం వలన స్ఫోటకం, పొంగులు, దుర్గంధాలు పోతాయి. దోమలు మొదలయిన క్రిమికీటకాదులు నశిస్తాయి. ఇతర ధూమాలు అంటే...గోళ్ళు, వెంట్రుకలు, శవం కాలినప్పుడు వచ్చే ధూమం నేత్ర రోగాల్ని ప్రకోపింపజేసి అనారోగ్యాన్ని ఆయుక్షీణాన్ని కలుగజేస్తాయి.



నంది వర్ధనం: ఇందులో ముద్దపుష్పం, రేక పుష్పం అని రెండు జాతులున్నాయి. సువాసన కలిగి ఉంటాయివి. పూజార్హమైనవి. వంటి రేక పువ్వును గరుడ వర్ధనం అని అంటారు. దీని ఆకు కట్టుకున్న పక్షంలో రక్త దోషం, శిరోరోగం, నేత్ర రోగం పోతాయి. దీని పండుటాకుల రసాన్ని కళ్ళలో వేస్తే కలకలు మానిపోతాయి. ఈ పువ్వులను కళ్ళ కద్దుకుంటే చలువజేస్తాయి. ఈ పువ్వుల రసాన్ని కళ్ళలో వేసుకున్నా, పడుకునే ముందు కళ్ళలో వేసుకుని కట్టుకున్నా కళ్ళ కలకలు, కళ్ళు ఎర్రబడటం, కళ్ళ మంటలు పోతాయి.



నక్క దోసకాయ: ఇది చిన్నదిగా ఉండి, పుల్లగా ఉంటుంది. పథ్యకరమయినది. జ్వరం వచ్చినప్పుడు కలిగే అరుచిని పోగొడుతుంది. చలవజేస్తుంది. విరేచనాన్ని, మూత్రాన్ని సజావు చేస్తుంది.

నల్లజీలకర్ర: నల్లగా సువాసన కలిగి కారంగా ఉంటాయివి. తింటే అజీర్ణం, కడుపుబ్బు, విరేచనాలు కడతాయి. కఫం, జ్వరం, నేత్ర రోగాలు, శిరో రోగాల్ని హరిస్తాయి. వీటిని గుడ్డలో కట్టి నలుపుతూ వాసన చూసిన పక్షంలో పడిశం, శిరోభారం, తలనొప్పి తగ్గిపోతాయి. వీటిని మెత్తగా నూరి అందులో మంచి గంధం, హారతి కర్పూరం కలిపి వంటికి పూసుకుంటే దురదలు, దద్దుర్లు, చలితం పోతాయి.





నర్మద నది నీరు: తియ్యగా రుచిగా ఉంటుంది. వీర్యవృద్ధి, బలాన్ని కలుగజేస్తుంది. త్రిదోషహరం. పథ్యంగా ఆరోగ్యంగా ఉంటుంది.

నల్లచెరకు: కొంచెం నలుపు, ఎరుపు కలిగి ఉంటుంది. కఠినంగా ఉంటుంది. కొద్దిగా వేడిజేస్తుంది. రుచిగా ఉంటుంది. త్రిదోషహరం. ధాతుపుష్టి, వీర్య వృద్ధి, బలాన్నిస్తుంది.

–నీలకణ్ఠాచార్య

ప్రతివారం మీకోసం ప్రత్యేకం

**నాకు నచ్చిన నా కథ**

# మువ్వలు

- భమిడిపాటి జగన్నాథరావు

సరళ అతన్ని చూస్తోంది. తను రెండు నిముషాలుగా అతనినే చూస్తున్నానని తెలిసి, కళ్ళు దించింది.

ఎదురుగా చిన్న కంప్యూటర్.

పెద్ద గది. చలిగా లేదు. చల్లగా ఉంది.

ఆ పెద్ద గదిలో వాళ్లిద్దరే ఉంటారు. గది వెనకగా ఓ ఫైలింగ్ కేబినెట్, చిన్న స్టీల్ ఆల్మైరా, విడిగా రెండు కుర్చీలు. ఇంకో ఫర్నిచర్ కాని, ఇతర వస్తువులు కాని ఇంకేవీ లేవు. శబ్ద కాలుష్యం తగలని గది.

ఆ గది అంతా మళ్లీ ఓసారి చూసి, అతనిని మళ్ళీ ఓసారి చూసింది.

కుడి చెంపన బాల్‌పాయింట్ పెన్ గుచ్చి, దీక్షగా, తదేకంగా, అతను గ్లాస్ టాప్ ఉన్న ఎదురుగా ఉన్న టేబిల్‌మీద పరుచుకున్న బ్లూ ప్రింట్స్ చూస్తున్నాడు.

అతను తన పనిలో శ్రద్ధగా అలా ఉండడం ఆమెకు ముచ్చటగా ఉంది.

అతను లేచి నిలుచున్నాడు. ఆరు అడుగులపైన, పొడవైన అతని పొడవు ఎబ్బెట్టుగా ఉన్నట్టుగా ఉంటుంది. నడుము పైభాగం వంగినట్లుగా ఉండి కాస్త గూనిలా అనిపిస్తుంది కాని, కాదు.

మనిషి నలుపు. కాస్త పొడవైన ముక్కు. అతని ముంజేతులు మగవాడి చేతుల్లా, మోటుగా ఉంటాయి. మరీ గుబురు మీసాలు. సరిగా దువ్వుకోని, దువ్వినా లొంగని జుట్టు.

అతను నుంచునే, చెంపన అరచేయి ఆన్చి, ఇంకోసారి ఆ బ్లూప్రింట్స్‌ను ఆకుపచ్చ పిల్లికళ్లతో చూస్తున్నాడు. అతని ఒత్తయిన కనుబొమ్మల కింద ఆ ఆకుపచ్చ కళ్ళల్లో కదలిక లేదు. చూపు అంతా టేబిల్‌పై ఉన్న డ్రాయింగ్స్ మీదే.

పనిలో ఉన్నప్పుడు పరిసరాలేవీ అతన్ని తాకవు. పని చేస్తున్నప్పుడు అతని ఏకాగ్రత ఆమెకు ఇష్టం. ఆమె ఇష్టం కాని, ఇతర ఇష్టాలు, ఆలోచనలు కాని అతనికి తెలియవు. అతను ఎక్కువగా మాట్లాడడు. ఇక ఆమె లోకం ఆమెది. అతని ముభావం. సీరియస్‌గా ఉన్నట్లు ఉండడం ఆమె చాలా మామూలుగా తీసుకుంటుంది.

ఉన్నట్టుండి ఆ మూడు బ్లూప్రింట్స్ చాలానీట్‌గా అందుకుని, కుర్చీ నెమ్మదిగా వెనుకకు జరిపి, చప్పుడు చేయని షూస్‌తో నడుస్తూ, అతను గది గుమ్మం తెరచి, మూసి మాయమైపోయాడు.

ఆమెకు పక్కున నవ్వొచ్చింది. పలువరస తెల్లగా, ముద్దుగా మెరిసింది.

అతను వెళ్ళిపోగానే సరళ చాలా వంటరి అయిపోయినట్టు అయిపోయింది.

'టూ ఈజ్ కంపెని' అనుకొని మళ్ళా నవ్వుకొంది.

సరళ అమ్మను తలచుకుని ఉల్లాసంగా అయింది.

ఆమెకు అమ్మ, అమ్మమ్మ - ఇద్దరే ఉన్నారు. అమ్మమ్మ వాళ్ళ ఊళ్ళో. అమ్మ తన దగ్గర.


సరళ తండ్రి పద్దెనిమిది ఏళ్ళక్రితం - ఆమె అయిదోఏట - సడన్‌గా పోయాడు. 'మాసివ్ హార్ట్‌ఎటాక్.' అమ్మ, అమ్మమ్మల దగ్గర పెరిగింది. ఉన్న ఒక్క మేనమామ పధ్నాలుగు ఏళ్లనాడు - భార్యను, ఇద్దరు ఆడపిల్లలను తీసుకుని అస్సాం వెళ్లిపోయాడు. ఉద్యోగం కోసం, ఉద్యోగం చేస్తూ, భార్యపిల్లల సహకారంతో - ఓ చిన్న స్కూలు నడుపుతున్నాడు... టీ తోటల్లో పనిచేసే వాళ్లకు, వాళ్ల పిల్లలకు చదువు చెబుతూ, వాళ్లల్లో ఒకే కుటుంబంగ కలిసిపోతూ, ఆ దూరం అమ్మను తమ్ముడిని చాలాదూరం చేసేసింది. రెండేళ్లకో చిన్న ఉత్తరం. సంవత్సరానికో గ్రీటింగ్.

వాళ్ల కుటుంబానికి దగ్గర బంధువులు చాలా తక్కువ. నాన్న, మామయ్య దూరమైపోయి, సరళ అమ్మమ్మ, అమ్మల నీడలో ఆడుకుంటూ, పాడుకుంటూ, చదువుకుంటూ పెరిగింది.

వాళ్ల ఊళ్లో పెంకుటిల్లునూ, ఇంటి వెనకాల పెరడునూ, ఇంటిముందు స్థలాన్నీ, ఆమె అమ్మమ్మ శుభ్రంగా, పూల సువాసనలతో, చెట్ల పచ్చదనంతో హాయిగా ఉంచేది. సరళ అమ్మ, అమ్మమ్మ ఒకే నాణంలో ఒదిగిన బొమ్మ, బొరుసులా కలిసిపోయి ఉండేవారు - ఆలోచనల్లో, బ్రతుకులో. ఆ తల్లీకూతుళ్లూ ఇద్దరూ కలిసి హాయిగా పాటలు పాడుకునే వారు.

సరళ తల్లి - సంధ్య ఆమె పేరు - కూతురికీ... ఇద్దరికీ తెలియకుండానే - చాలా విషయాల గురించి ఆలోచించడం, అనుభూతం చేసుకోవడమే కాక అనుభవంలో ఇమిడిన సత్యదీప్తి తాలూకు వెలుగు... ఈ అన్నిటితో నిండిన సుదూరమార్గం చివర అందుకునే లో వెలుగు - వీటన్నిటి గురించిచెప్పేది. తెలిసీ తెలియని వయసులో అన్నిటినీ అర్థం చేసుకోలేక, తన చిన్నకూతురు బిడియంతో నవ్విన నవ్వుల్లో ఆ తల్లి కూడా నేర్చుకుంది.

ఉదయపు అందాలను, సాయం సంధ్యలను, వెన్నెల వెలుగుల్నీ, చీకటి రాత్రులను, చెట్లలోని ఆకుపచ్చతనాన్ని, ప్రాణవంతమైన గాలిలోని హాయినీ, జీడిమామిడి తోటల్లోని చిన్న వెగటుతో కూడిన మత్తు సువాసనలను, లోకం.



లోకుల పోకడలను - ఆతల్లి తన కూతురుకు కనుపింపచేసి, ఆలోచింపచేసి, అనుభూతి సాంద్రతలో నిండిన లోతులకు, వెలుగులకు, దుఃఖ జ్వాలలను దగ్గరజేసింది.

సాహిత్యాన్ని, ఇంద్రియ చలనాలని, సంగీతాన్ని, నాదసుధా పారవశ్యాన్ని, ప్రకృతిని తల్లి ఒడిలో పెరిగే చంటిపిల్లతనాన్ని, భూమిని, సారవంతమైన ఆలోచనలను, మనసును, ఆరోగ్యవంతమైన మానసిక ఆరోగ్యాన్ని, భావాన్ని, భాషను, దుఃఖ బీభత్సాన్ని, కరుణను, ప్రేమను - ఈ జీవితంలో ఎలా దగ్గరకు తీసుకోవాలో ... ఆమెతల్లి సరళకు - బెత్తం పట్టుకున్న మేడమ్‌లా కాకుండా - పాపకు స్తన్యం అలవాటు చేసిన తల్లిలా - నేర్పింది.

అమ్మ జ్ఞాపకాలు తనలో తిరుగాడుతుంటే, సరళకు చల్లని ఆ పెద్దగదిలో - తను మరీ ఒంటరి అయిపోయినట్లుగా... బెంగగా, కడుపులో జాలిగా ఉన్నట్లుగా అయిపోయింది.

ఈ ఒంటరితనంలో, ఒంటరితనం అన్న ఈ భావనలోంచి జనం మధ్యకు, ప్రకృతి ఒడిలోకి, జీవితపు ఉరవడిలోకి వెళ్ళాలనిపించి - సరళ - టేబిల్ డ్రాయర్ తెరచి, తన బౌండ్‌బుక్ తీసుకుని, బుక్ తిరగేస్తూ - చైతన్య స్రవంతిలో ఉన్నట్టుగా, ములిగి, తేలి ఆడింది.

ఆ పుస్తకంలో ఆమె వేసుకున్న పెయింటింగ్స్, రాసిన కవితలు, కథలు, కీర్తనలు, పాటలు, గేయాలు - వాటి నొటేషన్స్‌తో - అన్నీ కలిసి ఉన్నాయి.

కొన్నిపేజీలు తిప్పి తను 'డ్రా' చేసిన ఇల్లు. లోపలి గదులు, వెలుగు, మొక్కలు, తీగలు, పెరటిలోని పూలతీగలు, విరయబోతూ ఇంకా ముకుళించుకుని ఉన్న పూల ముద్దతనం - అన్నీ చూసుకుంటూండడం - ఆమెను ఉల్లాసపరిచింది.

ఆమె ఆకృతి ఇచ్చిన ఆ ఇంటిలో - సర్దడానికి పెద్దగా సామానులేవీ లేవు. ఇంటి లోపల చల్లదనం, వెలుగు, శాంతి నిండాలంటే ఏవి ఉండాలి అని ఆలోచించడంకంటే, ఏవి ఉండకూడదో తెలుసుకోవడం ముఖ్యం అనీ - అదే 'ఇంటీరియర్ డెకరేషన్'కు జవం, జీవం అని ఆ నమ్మకం.

తను సగం సగం రాసి వదిలేసిన అసంపూర్తి కవితలూ, రచనలూ, జీవిత అవిచ్ఛిన్నతను సూచిస్తాయని ఆమె ఆలోచన.

'అవునా?! లేక అది తనలోని అసంపూర్ణతకు చిహ్నాలా? ఏమో!' అనుకుని నవ్వుకుంది. ఆ ఒంటరిగదిలో ఆమె నవ్వులోని సాంద్రత ఆ గదినంతటినీ అలముకుంది.

ఎదురుగా ఎవరో ఉన్నట్టు అనిపించి, కళ్ళు ఎత్తి చూసింది.

''ఎం.డి.గారు ఓసారి మిమ్మల్ని రమ్మన్నారండి..'' అన్నాడు బ్లూ పేంట్, షర్ట్‌లో ఉన్న ఆఫీస్‌బోయ్.

''సరే'' అని, సరళ అన్నీ నీట్‌గా సర్ది లేచి, గది తలుపుమూసి, మూసి వేసిన తలుపు వెనకాల ఉన్న గదిని తల్చుకుని, 'ఆ గది మరీ ఒంటరిదా?' అనుకుని చిరునవ్వు నవ్వుకుంటూ ఎం.డి. రూములోకి ప్రవేశించబోతూ, తలుపుపైన ఉన్న నేమ్‌ప్లేట్‌పై ఉన్న నారాయణస్వామి అన్న పేరు చదువుతూ ఆగింది.

సరళ పనిచేస్తున్న ఈ 'ఫర్మ్' ఒక కుటుంబ వ్యవహారం. తండ్రి నారాయణ స్వామి ఎం.డి., కొడుకు 'మధుసూదన్' జి.ఎం. తండ్రీ కొడుకులు ఇద్దరూ క్వాలిఫైడ్ ఆర్కిటెక్ట్స్. ఇంజనీర్స్. చదువు సంసారం, అభిరుచి, ఉన్న వాళ్ళు, ఇళ్ళకు, హాస్పటల్స్‌కీ, ఫ్యాక్టరీలకీ, హోటళ్ళకు – కొత్తగా, అందంగా, విశాలంగా అనిపించేటట్లు 'ప్లాన్స్' తయారుచేసి, నిర్మాణం చేపడతారు. ఈ ఫర్మ్‌కు దేశంలో చాలామంచి పేరు, ఖ్యాతి ఉన్నాయి.

ఇక్కడ సరళ 'ఇంటీరియర్ డెకరేషన్' విభాగానికి ఇన్‌చార్జి. కట్టిన ఇళ్ళల్లో, హాస్పటల్స్‌లో, ఫ్యాక్టరీలలో – లోపమే కాకుండా, బయట ఉన్న ప్రదేశాలలో కూడా కంటికి ఇంపుగా, చల్లగా, ప్రకృతికి దగ్గరగా 'ప్లాన్' చేసి శాంతి నిలపాలన్న సరళ ఊహను – తండ్రీ కొడుకులిద్దరూ – ఆలోచించుకుని – ఒప్పుకున్నారు.

సరళ గది లోపలికి వెళ్ళేసరికి, స్వామిగారు నెమ్మదిగా ఫోన్‌లో, తనలోకి మాట్లాడుకుంటున్నంత నెమ్మదిగా, మాట్లాడుతూ, ఆమెను కూచో మన్నట్టు కళ్ళతో సంజ్ఞచేస్తూ, ఫోన్‌పెట్టేసి, 'సారీ' అని కుర్చీలో ముందుకు వంగి రెండు బ్లూ ప్రింట్స్ సరళవైపు జరిపి, చూపించేరు.

చూపించి ''ఈ రెండు భవనాలకు లోపల, బయట ఏమి ఉంటే బావుంటుందో, ఏవి ఎక్కడ ఉంటే బావుంటుందో – మీరు ఆలోచించి, 'లిస్ట్' చేసి, 'డ్రా' చేసి రేపు సాయంత్రం నాలుగు గంటలకు ఇవ్వగలరా?'' అన్నారు స్వామి.

ఆయన మాటలు మెత్తగానే కాకుండా, మాటల్లో సంస్కారం, ప్రవర్తనలో నిండుతనం కలిసి హుందాగానూ, ముచ్చటగానూ ఉంటాయి.


ఓ బ్లూ ప్రింట్ చూస్తూ సరళ ''ఈ ఇంటికి అంత ఎత్తుగా ప్రహరీగోడ అవసరమంటారా?'' అంది.

''ఆయన అలా కావాలన్నారు. అలాగే అని ప్రొసీడ్ అవుతున్నాం'' అన్నారు స్వామి.

''అంత ఎత్తుగా చుట్టూ ప్రహరీగోడ ఉంటే ఇల్లు మూసుకుపోదూ'' అంది సరళ ప్రశ్న, ఆశ్చర్యం కలగలిపి.

స్వామిగారు నవ్వుతూ ''చెప్పి చూశాను. ఆయన – అదే ఆ కాబోయే ఇల్లుగలాయాన – ఒప్పుకోవడం లేదు'' అన్నారు.

''వారు ఇప్పుడున్న ఇంటి నెంబర్, ఎడ్రస్, ఫోన్ నెంబరు నాకు ఇవ్వగలరా?'' అంది సరళ.



కలిగిన ఆశ్చర్యాన్ని, సందేహాన్ని అదిమి స్వామిగారు ''అలాగే... ఆ సమాచారం మీ రూముకు పంపుతాను'' అన్నారు.

''ఏం లేదుసర్. ఇంటాయన ఆలోచన అది. ఇంటావిడతోఫోన్‌లో ఎప్పాయింట్‌మెంట్ తీసుకుని ఆవిడను కలిసి మాట్లాడదామని. అంత డబ్బుపోసి, భవంతిలాంటి ఇల్లు కట్టుకుంటూ, ఆ ఎత్తయిన ప్రహరీ గోడతో మూసుకుపోయినట్టు అయిపోయే ఆ ఇల్లు వాసయోగ్యం కాకుండా చిన్నసైజు జైలులా అయిపోతే 'జీవితమంతా ఖైదీలా ఎందుకు బంధింపబడతారు?!' అని ఆవిడను అడిగి, ఆమె అభిప్రాయం కూడా తెలుసుకుందామని'' అంది సరళ సీరియస్‌గా ముఖం పెట్టి.

స్వామిగారు పెద్దగా నవ్వి ''గుడ్ ఐడియా. గో ఎహెడ్'' అన్నారు.

''రేపు ఆవిడతో మాట్లాడి ఎల్లుండి సాయంత్రం నాలుగు గంటలకు నా సలహాలతో మీ దగ్గరకు వస్తాను'' అంది సరళ.

''సరే''.

సరళ లేచి, ఆ గది దాటి కారిడార్‌లో నడుస్తూంటే కాస్త చిరాగ్గా, కొంచెం హుషారుగా ఉన్నట్టనిపించింది ఆమెకు.

గదిలోకి వచ్చి కుర్చీలో కూచుందోలేదో, ఒకాయన చెప్పులు గట్టిగా చప్పుడు చేసుకుంటూ వచ్చి ''వీడేడీ'' అన్నాడు.

''వీడంటే? ఎవడు?'' అంది సరళ.

''మా వాసుగాడు'' అని శ్రీనివాస్ కూచునే 'సీట్'కేసి చూపిస్తూ, ఆమె ఎదురుగా ఉన్న కుర్చీని బర్రున లాగి కూర్చున్నాడు ఆయన.

''ఆయన బయటకు వెళ్ళేరు''.

''ఎప్పుడొస్తాడయితే వీడు''

''నాకు తెలియదు'' అని తన పని చూసుకోబోతోంది.

''అది కాదమ్మాయ్. వాసుగాడు నాకు మేనల్లుడు. సొంతం కాదనుకో. నేను వాడి మేనమావని వరసకి''.

ఇంతలో శ్రీనివాస్ గదిలోకి వచ్చి.

''ఇలా ఇక్కడకు రా మావయ్యా. ఎప్పుడొచ్చావ్?'' అన్నాడు.

''నీ కోసం గంట నుంచి చూస్తున్నానురా. ఇప్పటికి తమ దర్శన మయింది'' అన్నాడాయన నిష్ఠూరంగా. శ్రీనివాస్ సీట్ కెదురుగా కూచుంటూ.

శ్రీనివాస్ టేబిల్‌మీద ఉన్న గ్లాసులో ఉన్న మంచినీళ్ళు తీసుకుని చప్పుడు చేసుకుంటూ తాగేసి ''నీకు మీ అన్నయ్య ఓ సంబంధం చూసేడురా. ఆదివారం వెళ్ళిచూసుకో. నేను కూడా ఓ రెండు సంబంధాలు మీ అన్నయ్యకు చెప్పేను. మీ అన్నయ్య ఈ రాత్రి నీకు 'ఫోన్' కొడ్తానన్నాడు. నాకు ఈ ఊళ్ళో పని ఉండి వచ్చాను. నీకు ఈ మాట చెప్పిపోదామని ఇటు వచ్చేను'' అన్నాడు ఆయన.

శ్రీనివాస్ కాస్త ఇబ్బందిగా చూస్తూ ''మావయ్యా – నీకు ఇంటి తాళాలు ఇస్తాను... ఇంటికివెళ్ళి కాస్త విశ్రాంతి తీసుకో. ఇల్లు నీకు తెలుసుగదా. నేను సాయంత్రం వస్తాను'' అన్నాడు.

''ఇంకా నయంరోయ్! నీ బ్రహ్మచారి కొంప నాకేం వీలుగా ఉంటుంది! అయినా నాకు ఈ ఊళ్లో పని అయిపోయింది. పెళ్ళి సంబంధాల విషయం కూడా నీకు చెప్పేశాను. నే పోతానురా''.

''అన్నయ్య నాకు ఉత్తరం రాసేడు. మొన్న ఫోన్ కూడా చేసేడు''.

''అయితే ఇంకేం. నే పోతానిక. బ్రహ్మచారి ముదరకూడదురోయ్'' అని తన మాటలకు తనే పగలబడి నవ్వుతూ వెళ్ళిపోయాడాయన గది తలుపు 'డామ్మ'ని మూసేసి.

అప్పటిదాకా సరళకు తన కొలీగ్ శ్రీనివాస్‌కు పెళ్ళి అవలేదన్నది తెలియదు. ఆ విషయం కాని, అతనికి సంబంధించిన మిగతా విషయాలు కానీ ఆమె ఆలోచనల్లో ఏనాడూ లేవు.

ఉన్నట్టుండి శ్రీనివాస్ ''అయామ్ సారీ, ఆయన మిమ్మల్ని ఇబ్బంది పెట్టినట్టున్నాడు'' అని, అప్పటికే చాలా మాట్లాడినట్టు 'కామ్' అయి పోయాడు.

ఆమె తన పనిలోనూ, అతడు తన పనిలోనూ ఆ సాయంత్రం దాకా ఉండి పోయారు.

ఆ రాత్రి ఆమెకు ఫోన్ వచ్చింది. స్వామిగారు చెబుతున్నారు ''రేపు సాయంత్రం ఆరున్నరకు మా అమ్మాయి, ఆవిడ మీ ఇంటికి వద్దామను కుంటు

న్నారు... మీకు వీలుగా ఉంటుందా?''

''ఇంట్లోనే ఉంటానండి. మా ఇల్లు'' అని సరళ అంటుండగా.

''మన డ్రైవర్ రాజుకు మీ ఇల్లు తెలుసు. రేపు సాయంత్రం ఆరున్నరకు వస్తారు. ఉండనా'' అని స్వామిగారు ఫోన్ పెట్టేశారు.

మర్రోజు సాయంత్రం స్వామిగారి భార్య, అమ్మాయి వచ్చేరు.

''వచ్చే ఆదివారం మా మనవరాలి పుట్టినరోజు. మీరు. మీ అమ్మగారు తప్పక రావాలి'' అన్నారు స్వామిగారి భార్య సీతగారు.

''పిల్ల వయసెంత? పేరేమిటి?''

పిల్ల పేరుచెప్పి ''ఆరేళ్ళు. ఇద్దరూ తప్పకరండి'' అని ఆ పిల్లతల్లి సుందరి కూడా చెప్పి ''డిన్నర్ అక్కడే'' అని చెప్పి ఇద్దరూ వెళ్ళిపోయారు.

మర్రోజు ఆఫీసులో స్వామిగారు చెప్పేరు ''ఆఫీసు స్టాఫ్ అంతా కుటుంబాలతో వస్తారనీ, అంతా కలిసి ఇంట్లోనే రాత్రి భోజనాలు చేద్దాం'' అని.

ఆ ఆదివారం సాయంత్రం సరళ, ఆమె తల్లి సంధ్య స్వామిగారి ఇంటికి వెళ్ళేరు. మిగతా స్టాఫ్ అంతా కుటుంబ సభ్యులతో వచ్చేరు. స్వామిగారి కుటుంబం అంతా వచ్చినవారంద రితో మర్యాదగా, ఆత్మీయంగా ఉన్నారు. చిన్నిచిన్న ఆటలు, పాటలతో, జోక్స్‌తో అందరూ ఆ సాయం సమయం హుషారుగా గడిపేరు.

పుట్టినరోజు జరుపుకుంటూన్న పిల్ల సుష్మ 'కేక్' కట్‌చేసి ఆ ఆనందంలో ఉంది.

భోజనాలకు ముందు స్వామిగారి భార్య, ఇద్దరు అమ్మాయిలు వచ్చిన ఆడ వాళ్ళందరికీ ఇల్లు అంతా చూపించేరు. ఆ ఇంటిలో ఏ చోట చూసినా సంపద తళుక్కుమని, జిగేల్‌మని మెరుస్తోంది. ఆడవాళ్ళ ఆభరణాలన్నీ వజ్రాలతో, కెంపులతో నిండి ఉన్నాయి. ఇంట్లో ఫర్నిచర్, వస్తువులూ - అన్నీ ప్రత్యేకించి చాలా డబ్బు పోసి చేయించినవీ, కొన్నవీ అని తెలుస్తూనే ఉన్నాయి.

''మాకు ఇద్దరు ఆడపిల్లలండి. ఇద్దరూ పెళ్ళి అయి సెటిల్ అయ్యారు. ఆఖ రున అబ్బాయి. పెళ్ళి చేద్దామనుకుంటున్నాం'' అని స్వామిగారి భార్య అమ్మతో అనడం సరళ విన్నది.

అందరూ ఆ సాయంత్రాన్నీ, భోజనాన్నీ 'ఎంజాయ్' చేసేరు.

పది రోజుల తర్వాత సరళ ఇంటికి వెళ్ళి, స్నానం చేసి, తల్లితో భోజనం చేస్తుండగా ''ఇవాళ స్వామిగారు, భార్య సాయంత్రం ఇక్కడకు వచ్చారు'' అంది సంధ్య కూతురితో.

''ఇక్కడికా?!'' అని ఆశ్చర్యపోయింది సరళ.

''అవును. నాకు ఫోన్‌చేసి సాయంత్రం నాలుగు గంటలకు వచ్చేరు''.

''వచ్చి....?''

''నిన్ను వాళ్ళ ఇంటి కోడలిని చేసుకుంటారుట. నీతో చెప్పి ఆలోచించుకుని ఓ పది రోజుల్లో చెప్పమన్నారు''.

సరళ ఓ రెండు నిముషాలు ఆగి ''నేను నాలుగు రోజులు సెలవు పెడతాను. అమ్మమ్మ దగ్గరకు వెళ్దాం. అందరం అక్కడ మాట్లాడు కుందాం'' అంది.

వాళ్ల ఊరి ప్రయాణంలో తల్లీకూతుళ్లు అలవాటుగా చాలా విషయాలు మాట్లాడుకున్నారు - వీళ్ల సంగతి తప్ప.

ఇంట్లో అడుగుపెడుతూ ''అమ్మా - అమ్మమ్మకు విషయం చెప్పు. రేపు మాట్లాడుకుందాం'' అంది సరళ.

మర్రోజు ఆ ఇంటి పెరటిలో మల్లెమాలలు కడుతూ కూచున్నారు ముగ్గురూ.

''మీ ఇద్దరి ఉద్దేశం ఏమిటి?''

''ఈ విషయంలో నిర్ణయం నీవే తీసుకోవాలని నేనూ, అమ్మమ్మా అను కున్నాం. పెళ్లి చేసుకునేది నీవు కదా! నీ ఆలోచనే మా ఆలోచన అవుతుంది''.

అమ్మమ్మగారు అంది ''పిల్లవాడు బాగానే ఉన్నట్టున్నాడే. వాళ్ళు ఇచ్చిన ఫొటో అమ్మ చూపించింది''.

## నాకు సంతృప్తినిచ్చిన కథానిక



నేను రాసిన కథానికలలో నాకు తృప్తినిచ్చినవి అయి దారు కథలు మాత్రమే! సంతృప్తినిచ్చినవి మూడు నాలుగు మాత్రమే!

నాకు సంతృప్తి మిగిల్చిన కథానికలలో 'మువ్వలు' ఒకటి. సహృదయ పాఠకుల మీద నాకు ఉన్న నమ్మకంతో ఈ కథానిక సారం, రూపం వారికి తెలుస్తుందన్న విశ్వాసం నాకు ఉండడంతో, దీన్ని ఇందుకోసం రాసేనని వివ రించను. అన్యథా భావించవద్దు!

**-భమిడిపాటి జగన్నాథరావు**

**9440883812**

సన్నని గాలి మల్లెల సువాసనలతో నిండి వాళ్ల ముగ్గురి మధ్య నిండి ఉండగా సరళ ''అంత డబ్బున్న ఇంట్లో నేను వాళ్లకు కావలసిన కోడలుగా ఉండలేనని పిస్తోంది అమ్మమ్మా. అమ్మ కూడా చూసింది ఆ సంపద. అంత సంపద ఉన్న ఇంట్లో నేను ఇబ్బందిగా అయిపోయి ఇరుక్కు పోతానేమో అనిపిస్తోంది'' అంది.

కాసేపు ఉండి సరళే అంది ''అబ్బాయి నిజంగానే బావుంటాడు. నాకంటే అతనే బావుంటాడు. చిన్నప్ప టినుండీ చిక్కటి పాలు, గడ్డ పెరుగు, వెన్న, మీగడ, తేనెలతో పెరిగినట్టు నున్నగా, మెత్తగా ఉంటాడు. నాకు నా జీవితం ఓ రకంగా ఉండాలనిపిస్తోంది. అలా ఉంటేనే నాకు శాంతిగా ఉంటుంది. అశాంతి ఉండక పోవచ్చుకానీ, నేను కోరుకునే శాంతి ఆ ఇంట్లో దొరక దని నాకు అనిపిస్తోంది. వాళ్ల ఆడపిల్లలిద్దరూ బాగా చదువుకున్నా, భర్తలకు భార్యలుగా ఇంట్లోనే ఉంటు న్నారు. నాకు జీవితం అంతా ఉద్యోగం చేయాలని ఉంది. చేస్తున్న ఉద్యోగంలోనే 'జాబ్ శాటిస్‌ఫేక్షన్' కావాలనుకుంటాం కదా! జీవితంలో తృప్తిని ఆశిం చడం అత్యాశకాదు కదా! నా జీవితంలో తృప్తిగా ఉంటూ శాంతిని పొంది, ఆ స్ఫూర్తితో ఇతరులకు ప్రేమ. ఆత్మీయత, అను రాగం అందించాలని ఉంటుంది నాకు. అక్కడ అతని భార్యగా నా జీవితం ఇరు కుగా అయి పోతుంది. అతనితో జీవించడం వద్దు అనే నా నిర్ణయం''.

''సరే అలాగే'' అని ఆ తల్లీకూతురు ఆ చిన్నతోటలో చెట్లకు, మొక్కలకు తీగ లకు నీళ్లు పోస్తూ సరళతో మాట్లాడుతూ గడిపేసేరు.

బయలుదేరే రోజున సంధ్య అంది. ''అమ్మాయ్! అమ్మమ్మ ఓ నాలుగు రోజులు ఉండమంటోంది. నువ్వువెళ్లు. ఐదో రోజున నేనక్కడకు వచ్చేస్తానులే''.

''అన్న సమయానికి వచ్చెయ్యాలి మరి'' అంది సరళ ముభావంగా.

''అలాగేలే. నీకు నీ దగ్గర మీ అమ్మ ఉండాలని ఉన్నట్టుగానే, మీ అమ్మకు వాళ్ల అమ్మదగ్గర ఉండాలని ఉండదా ఏమిటి? క్షేమంగా వెళ్ళిరా'' అంది అమ్మ మ్మగారు నవ్వుతూ.

సరళ బయలుదేరుతూండగా ''నేను వచ్చి స్వామిగారి ఇంట్లో మాట్లాడు తానులే'' అంది సంధ్య.

''నువ్వు చెప్పేరోజు ఉదయాన్నే నేను రాజీనామా ఇస్తాను'' అంటూ సరళ బస్ ఎక్కేసింది.

సరళ మామూలుగా మొదటి రోజునే ఆఫీసు పనిలో మునిగిపోయింది.

రెండోరోజు కాస్త ఖాళీగా ఉన్నప్పుడు శ్రీనివాస్ కేసి చూసింది. అతని నిశ్చల తను చెదరగొడదామన్న చిలిపి ఊహ ఆమెలో రేగింది.

''ఏమండీ - ఆ మధ్య ఎం.డి.గారి మనవరాలి పుట్టిన రోజు డిన్నర్ మిస్ చేసేరు - మీ ఊరు వెళ్ళేరా?'' అంది.

''అవునండి''.

''పెళ్ళి సంబంధాలు చూశారా?''

అతను కాసేపు ఆగి ఆ తర్వాత ''చూశాను'' అన్నాడు.

''ఎన్ని - ముగ్గురు ఆడపిల్లల్నా?''

''కాదు. ఒక అమ్మాయి....'' అని అతను అంటుండగా.

''పిల్ల బావుందా? నచ్చిందా?'' అంది.

ఆమె అలా అడుగుతుందని అనుకోని శ్రీనివాస్ తమాయించుకుని ''అమ్మాయి బావుందండి'' అన్నాడు మీసాల చాటున నవ్వును దాచేస్తూ.

''మరి పెళ్ళి ఎప్పుడు? నన్ను పిలుస్తారా?'' అంది ఆటపట్టిస్తున్నట్టుగా.

''అంతవరకూ రాలేదులెండి''.

''అంటే - కట్నకానుకలు బేరాలు జరుగుతున్నాయా?'' అంది నవ్వుతూ కవ్విస్తున్నట్లుగా.

''అంతా చెప్పాలంటే చాలా చెప్పాలండీ'' అని ఊరుకున్నాడతను.

''అన్నీ చెబుదురుగాని - రేపు రాత్రి మా ఇంటికి డిన్నర్‌కు రండి. రాత్రి ఎని మిదికి రాగలరు కదూ?''

నవ్య పజిల్

## పదగారడి-321

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ✱ | 2 | | 3 | | 4 | ✱ | 5 |
| | ✱ | | ✱ | | ✱ | | ✱ | |
| 6 | | ✱ | ✱ | 7 | | ✱ | 8 | |
| | ✱ | 9 | ✱ | | ✱ | 10 | ✱ | |
| ✱ | 11 | | | ✱ | 12 | | | ✱ |
| 13 | ✱ | | ✱ | 14 | ✱ | | ✱ | 15 |
| 16 | | ✱ | 17 | | ✱ | ✱ | 18 | |
| | ✱ | 19 | ✱ | | ✱ | 20 | ✱ | |
| | ✱ | 21 | | | | | ✱ | |

### ఆధారాలు

**అడ్డం**

2. మేనకవలచిన తపస్వి.
6. బరువే.
7. యజ్ఞం వంటిదే.
8. సస్యం..? వాడుకలో.
11. భారతంలో ఇతని భవనం.
12. సరస్వతీదేవి.
16. రెండు వస్తువులు...
17. విత్తనం..
18. పాండురాజు సతి.
21. శివుడు.. వైకుంఠవాసివలె.

**నిలువు**

1. తల్లి బాస..?
2. అమృతం కాదు. వ్యతిరేకం.
3. ధనియాల తోడివి.. ఘాటు.
4. తలకింద్రులుగా తలగడ.
7. విష్ణువు. లక్ష్మిని పొందినవాడు.
9. మోక్షమే.
10. ఇది అడవి.
13. సర్పం.. లోపల జగం.
14. రాయంచ... సాగింది.
15. విశ్వామిత్రుడు రామ సోదరులకు బోధించిన విద్య.
19. శీర్షాసనం వేసిన దశరథపత్ని.
20. దాసురాలు...

**పదగారడి - 320 సమాధానాలు**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 న్యా | ✱ | 2 అ | సు | 3 కూ | ల | 4 వ | తి | ✱ |
| య | ✱ | ష్టు | ✱ | లం | ✱ | డి | ✱ | 5 త |
| 6 వా | రం | ✱ | ✱ | 7 క | త్తి | ✱ | 8 తు | మ్మ |
| ది | ✱ | 9 వా | ✱ | ష | ✱ | 10 పా | ✱ | డు |
| ✱ | 11 త | రు | ణి | ✱ | 12 ఆ | మ | ని | ✱ |
| 13 అం | ✱ | వం | ✱ | 14 గా | ✱ | జం | ✱ | 15 స |
| 16 గ | ద్యం | ✱ | 17 వా | లి | ✱ | ✱ | 18 కం | చి |
| న | ✱ | 18 రు | ✱ | వా | ✱ | 20 వ | ✱ | వు |
| ✱ | 21 వి | జ | య | న | గ | రం | ✱ | డు |

నిర్వహణ: పెద్దిభొట్ల సుబ్బరామయ్య

"మీ ఇంటికి డిన్నరుకా?! వద్దులెండి"

"మీరు రేపు రాత్రి ఎనిమిది గంటలకు భోజనానికి మా ఇంటికి వస్తున్నారు" అనేసి, ఆమె లేచి ఇంటి చిరునామా ఉన్న తన విజిటింగ్ కార్డ్ అతనికి అందించి "ఎం.డి.ని కలవాలి" అని వెళ్లిపోయింది.

మర్రోజు రాత్రి ఎనిమిదికి రెండు నిముషాల ముందు ఆమె ఇంట్లో 'కాలింగ్ బెల్' చిలక పలుకులా పలికింది.

సరళ తలుపుతీసి గుమ్మానికి కాస్త దూరంగా నిలబడి ఉన్న శ్రీనివాస్‌ని చూసి "స్వాగతం" అంటూ, అతనిని కూచోబెట్టి, నాలుగు పత్రికలు అతనికి చూపుతూ "చదువుతూ ఉండండి. పోపుచేసి నేనిప్పుడే వచ్చేస్తాను" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

కాసేపట్లో "పోపులో ఆ మినపప్పు ఇంకో అరనిముషం వేగేక మిరప కాయలు. మిగతావి, ఆ తర్వాత చివరలో కరివేపాకు వేస్తే సమంగా వేగి ఉంటాయి" అని వినిపించి ఆమె తల తిప్పి చూసింది.

శ్రీనివాస్ ఆమె వెనుకనే ఉన్నాడు.

"చప్పుడు చేయకుండా పిల్లిలా వచ్చేరే. అయినా పోపు గురించి అంత క్షుణ్ణంగా మీకు ఎలా తెలుసు? శృత పాండిత్యావా!" అంది సరళ పోపు దింపుతూ.

"నా భోజనం రోజూ నేనే వండుకుంటాను".

"అంతేలెండి. ఒక్కరూ ఉంటారుగా. హోటల్ భోజనం బావుండదుకదా! తప్పక వండుకు తీరాలి గదా" అంది.

"అది కాదులెండి. నా చిన్నప్పటినుండీ వంట నేర్చుకున్నానండీ".

"అదేమిటీ?"

"మా అమ్మ నేర్పించింది. నేను నేర్చుకున్నాను".

ఆమె బుగ్గలు వంటసెగకు కొద్దిగా ఉబ్బి, మరీ ఎర్రగా కందిపోయాయి.

"పది నిముషాల్లో నేను స్నానం చేసి వచ్చేస్తాను. ఎంగేజ్ యువర్ సెల్ఫ్. ఇప్పుడే వస్తా" అని ఆమె వెళ్ళిపోయింది.

ఆమె వచ్చేటప్పటికి, అతను ఆమె పుస్తకాల 'రేక్'లో పుస్తకాలు చూస్తున్నాడు.

ఆమె "భోజనం చేసేద్దామా, నేను టేబిల్‌సిద్ధం చేస్తాను" అంటూ భోజనాల టేబిల్‌మీద - 'మేట్స్' పెట్టి, వాటిమీద డిన్నర్ ప్లేట్లు, సైడ్ ప్లేట్లు, స్పూన్లు, వంటకాల గిన్నెలపై మూతలు పెట్టి ఉండడం చూసి ఆశ్చర్యపోయినా ఏమీ అనకుండా "మీరు స్నానం చేస్తారా - నా చీర ఇస్తాను... వంటికి చుట్టుకొని సర్దుకోవచ్చు" అంది.

అతను "అన్నీ అయిపోయాయండి" అని అతి మామూలుగా అని ఊరుకున్నాడు.

'జోక్'కు కూడా నవ్వడా ఇతను?' అనుకొని ఆమె మనసులో కాస్త చిరాకు పడింది.

భోజనానికి టేబిల్ దగ్గరకు వెళ్తూనే శ్రీనివాసే అన్నీ చాలా నీట్‌గా ప్లేట్లలో సర్దడం మొదలుపెట్టాడు. అతను చేసే ఆ పని తీరులో నేర్పు, పరిపూర్ణత ఆమెకు తెలుస్తూనే ఉంది.

"వంట నేను. వడ్డన మీరు, తినడం ఇద్దరవూ అన్నమాట" అంది సరళ నవ్వుతూ.

"మీరు ఆరుగంటలకే రమ్మనమంటే వంటలో నేను సాయం చేసేవాణ్ణి" అని ఊరుకున్నాడు అతను.

భోజనం చేస్తూ, అతను పదార్థాలన్నీ ఎంత రుచిగా ఉన్నాయో చెబుతూ, నెమ్మదిగా, తృప్తిగా తింటూ ఆమెకు పెరుగు వడ్డిస్తూ "మా అమ్మ వండినవి కూడా ఇంత రుచిగానూ ఉండేవి" అన్నాడు. అతను ఆ మాటలు అంటున్నప్పుడు అతని కళ్ళల్లో చెమ్మ ఊరిందా అని ఆమెకు అనిపించింది.

"నిన్న ఆఫీసులో చాలా విషయాలు చెప్పాలన్నారు. ఇప్పుడు చెప్పండి" అంది.

అతను చేతులు కడుక్కొని, తుడుచుకుని, ఖాళీ ప్లేట్లు తీసి 'కిచెన్ సింక్'లో ఉంచి, వచ్చి డ్రాయింగ్ రూములో కూచున్నాడు.

రెండు నిమిషాలలో ఆమె వచ్చి, అతనికి ఎదురుగా కూచుని, "బతిమాలితే కాని విషయాలు చెప్పరేమిటి? నాకు బతిమాలడం, బతి మాలించుకోవడం అలవాటు లేదు. సరేలెండి - మీ గుట్టు మీ దగ్గరే ఉంచుకోండి" అని

ఆమె రెండు పుస్తకాలు తీసుకువచ్చి ''మీకు సాహిత్యం ఇష్టమేనా?'' అంది.

అతను ఆ పుస్తకాలు చూడకుండానే ''మా నాన్నకు ఇద్దరు భార్యలండి. మా దొడ్డమ్మ పోయాక మా నాన్న మా అమ్మను చేసుకున్నాడు. దొడ్డమ్మకు ఇద్దరు పిల్లలు. అక్కయ్య, అన్నయ్య. మా అమ్మకు నేను ఒక్కణ్ణే. అక్కయ్య, బావగారు భోపాల్‌లో ఉంటారు. అన్నయ్య వ్యవసాయం, వ్యాపారం చూసుకుంటాడు మా ఊళ్ళో. మా వదిన చాలా మంచిది మా అమ్మలా, మా నాన్నకు నేను ఏనాడూ చేరువ కాలేక పోయాను. ఆయన ధాష్టీకం ఆయనను నాకు దూరం చేసింది. మా అన్నయ్యదీ అదే తీరు. పదిహేనేళ్ళ క్రితం మా నాన్న పోయాడు. మా అమ్మే నాకు అన్నీ అయింది. నాకు చదువు, నడత, వంట, అల్లికలు, కుట్లు అలంకరణ - అన్నీ నేర్పింది. నేను అవి అన్నీ చాలా ఇష్టంగా నేర్చుకున్నాను - మా అమ్మ మీద ఇష్టంతో'' అన్నాడు.

''మీ అమ్మగారు ఇప్పుడు ఎక్కడ ఉన్నారు? మీ ఊళ్ళోనా?'' అంది సరళ.

'అక్కడ' అతను కుడిచేయి చూపుడు వేలు ఆకాశం వైపు చూపించేడు.

చెప్పేది ఎవరి విషయమో అన్నట్టు అతను చాలా మామూలుగా చెబుతున్నా, అతను మాటలు పలికే తీరులో, కళ్ళల్లో సన్నటి బాధా వీచిక లీలగా మెదిలిందా - అనుకుంది సరళ.

తన బాధ, దిగులు ఎవరితోనూ అతడు పంచుకోడని ఆమెకు తెలిసింది. మరో పక్క ఇతరులను ఆర్ద్రతతో ప్రేమాస్పదంగా గౌరవించే సుగుణం అతనిలో ఉందనీ ఆమె గుర్తించింది.

తల్లి విషయంగా అతనిలో వచ్చిన మార్పునీ, దాచుకుంటున్న విషాదాన్నీ తగ్గిద్దామని ఆమె ''ఇంతకీ పెళ్ళి చూపుల విశేషాలు, పెళ్ళి కూతురి గురించి చెప్పండి'' అంది.

''మా అన్నయ్య ఎవరో ఓ అమ్మాయితో నా పెళ్ళి కానిచ్చేసి బాధ్యత తీర్చేసుకుని చేతులు దులిపేసుకుందామని అనుకుంటున్నాడని నాకు తెలుసు''.

''మీ కాబోయే శ్రీమతి గురించి చెప్పండి బాబూ. సిగ్గా?'' అంది.

''సిగ్గెందుకండి. అమ్మాయి గ్రాడ్యుయేటుట. ప్రైవేటుగా డిగ్రీ చేసినట్టుంది. పెళ్ళి చూపులకు నేను వెళ్ళనన్నాను. నాకు చెప్పకుండా తెచ్చిన ఆ అమ్మాయి ఫొటో చూపించేరు. ఫొటోలో బాగానే ఉంది ఆ అమ్మాయి''.

''నాకంటేనా?'' అంది సరళ ఉన్నట్టుండి అనాలోచితంగా.

అతను ఓ చిరునవ్వు నవ్వి గుబురు మీసాల చాటున దాచేసుకున్నాడు.

'నవ్వడు కానీ, నవ్వితే బావుందే' అని ఆమె మనసులో 'నోట్' చేసుకొంది.

''ఆ సిట్ అవుట్‌లో కూచుందామా? ఇంటికి వెళ్ళిపోవాలా?'' అంది సరళ.

''పదకొండు దాటేక అన్నయ్య ఫోన్ చేస్తానన్నాడు. మీకు ఇబ్బంది కాకుండా ఉంటే మీ ఇష్టం''.

ఇద్దరూ నక్షత్రాల గొడుగు కింద కూచున్నారు.

ఇంతలో ఇంట్లో లైట్లు పోయాయి. ఆమె లేచి పక్కనే ఉంచుకున్న బాటరీ లైట్ సాయంతో ఇంట్లోకి వెళ్ళి, 'మెయిన్'లో కొత్త ఫ్యూజ్ వేసి దీపాలు వెలిగించింది. పెద్ద దీపాల బదులు అన్ని గదుల్లో నీలపు కాంతితో వెలిగే చిన్నబల్బులు మాత్రం ఉంచి 'సిట్ అవుట్'లోకి వచ్చి కూచుంది.

ఆమెకు అమ్మ గుర్తుకొచ్చింది.

ఆమె నెమ్మదిగా తన అమ్మ, అమ్మమ్మల గురించి, నాన్న హఠాత్తుగా పోవడం, మావయ్య దూరంగా వెళ్ళిపోవడం - ఆ తర్వాత తనకోసం అమ్మ లెక్చరర్ ఉద్యోగం మానేయడం - అన్నీ చెబుతూండగా, గాలి చల్లగా అయిపోయింది.

అతను లేచి నిలుచుని ''నేను వెళ్తొస్తాను'' అన్నాడు.

''సరే''.

చూస్తుండగానే నక్షత్రాలు కరిగిపోతూ మాయమైపోయాయి. నల్లటి మేఘాలు అలుముకోడం, సన్నటిజల్లు వాళ్ళిద్దరనూ తడపడం, ఉన్నట్టుండి వర్షం సూదుల్లా గుచ్చుకోడం, ఆకాశాన్ని చీల్చిన తటిల్లత మెరుపులో వర్షం వెలిగి వెండిదారాల్లా కిందికి దిగుతూ, భూమినీ, ఆకాశాన్నీ కలిపివేయడం చీకటిలో జరిగింది.

ఇద్దరూ లోపలికి వచ్చేరు.

అతను ఛట్టున ఆ వర్షంలో బాల్కనీలోకి వెళ్ళి కుర్చీలు, దిళ్ల లోపలికి తీసుకువచ్చాడు.

అతను తడిసి ముద్దయిపోయాడు.

ఆమె అందించిన టవల్‌తో తుడుచుకున్నాడు.


ఈడు... జోడు ... అందం... ఐశ్వర్యం
కళ్యాణం ... కాకతీయ!

కాకతీయ మ్యారేజస్ ప్రై. లిమిటెడ్.
103, 109 & 203, విజయశ్రీ అపార్ట్‌మెంట్స్, చర్మాస్ వెనుక,
అమీర్‌పేట, హైదరాబాద్. 500 073.
ఫోన్స్: 040 - 23747777, 9391999999

FREE online Registration & Free search



www.kaakateeya.com
www.telugumarriages.com
www.kannadamarriages.com
www.tamilmarriages.com



అమీర్‌పేట | నెల్లూరు
కూకట్‌పల్లి | తిరుపతి
దిల్‌షుఖ్‌నగర్ | కర్నూలు
విజయవాడ | (చెన్నయ్) టి.నగర్
గుంటూరు | బెంగుళూర్
తెనాలి | సేలం
విశాఖపట్నం | మధురై
రాజమండ్రి | వెల్లూరు
కాకినాడ | తిరుచి
ఖమ్మం | పాండిచ్చేరి
ఒంగోలు | ఈరోడ్
ఏలూరు

చెన్నయ్ (అన్నానగర్), చెన్నయ్ (పోరూర్), (చెన్నయ్) తాంబరం, జయానగర్, కోయంబత్తూరు.


''మీ బట్టలన్నీ తడిసిపోయాయి. మీకు చీర చుట్టుకునే యోగం తప్పేట్టు లేదు - నా చీర తెస్తానుండండి'' అంటూ ఆమె బెడ్‌రూమ్‌లోకి వెళ్ళింది. ''వద్దండి'' అంటూ అతను లోపలికి వెళ్ళేడు.

వర్షపు జోరు ఎక్కువయింది. వేడెక్కి ఉన్న గాలి, భూమి వర్షపు జలధారలతో చెట్లు ప్రాణవంతమవుతూ, ఉధృతంగా ఊపేస్తున్న గాలుల విసురులకు ప్రకృతిలో ఆనందం నిండి శాంతిస్తోంది.

నెమ్మదిగా ఓ రెండు గంటలకు వర్షం తగ్గి పుడమి, ప్రకృతి, ఆకాశం, గాలి నీరు ఆనంద ప్రపూర్ణమయి తన్మయస్థితికి చేరి ప్రశాంతత నిండింది.

ఆమె ఆ మత్తు వీడుతుండగా, తను మంచం మీదకు ఎలా చేరిందో, తను ఈ స్థితిలోకి ఎలావచ్చిందో గుర్తు తెచ్చుకుందామనుకుంటూండగా, ఆమెను నిదుర మళ్ళా మైకంలోకి జార్చేస్తుంటే పక్కన ఉన్న అతనిని అరమోడ్పు కళ్ళతో చూస్తూ ''నన్ను నిదుర కమ్మేస్తోంది. మీరు వెళ్ళిపోతే, ఆ తలుపు తీసుకుని దగ్గరగా మూసివెళ్ళండి. ఇక్కడ నా దగ్గర ఉండిపోవాలనిపిస్తే... ఉండు'' అంటూ గాఢమయిన నిదురలోకంలోకి నిండుగా, తృప్తిగా జారిపోయింది.

***

పిట్టలు కూస్తున్నాయి. తెరచిన కిటికీలో నుండి చల్లని గాలులు ఆమెను తాకుతున్నాయి. కిటికీని నిండి ఉన్న ఆకసం తెల్లగా, స్వచ్ఛంగా చల్లగా ఉంది. కిటికీలో నుండి తెల్లవారుజాము వెన్నెల పాకి మంచాన్ని కప్పుతూ ఆమెను నిండి ఉంది.

పక్కన ఖాళీగా ఉండడం గమనించి 'వెళ్ళిపోయి ఉంటాడు' అనుకుంటూండగా, కింద నేలమీద కూర్చుని మంచం పట్టెమీద ఆన్చిన వదనాన్ని రెండు అరచేతులలో బిగించి, తనవేపు దీక్షగా, ఇష్టంగా చూస్తున్న అతని ఆ రెండు ఆకుపచ్చ కళ్ళ వెలుగు తనని నింపుతున్నట్టుగా ఆమెకు తెలిసింది.

*

*-ఆదివారం ఆంధ్రజ్యోతి, 5 డిసెంబరు 1999*